క్లుప్తంగా

బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి చంద్రకళ

కోటపల్లి: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్లో మంగళవారం 31 బూత్‌స్థాయి, ఎన్నికల సూపర్‌వైజర్ అధికారులకు ఒక్కరోజు శిక్షణ తరగతులను ఆర్‌వో చంద్రకళ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. ఎన్నికల ఓటరు లిస్టు తయారీలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ట్రైనర్ కృష్ణమూర్తి, ఆర్‌ఐ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారీ వాహనాలు అనుమతించాలని వినతి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం: మండలంలో భారీ వాహనాల రాకపోకల కోసం అనుమతివ్వాలని, 4లైన్ హైవే జన్నారం మీదుగా వేయాలని కోరుతూ మంగళవారం ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్‌ను ఆదిలాబాద్‌లోని తన చాంబర్‌లో కలిసి మండలవాసులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, సామాజిక ఉద్యమకారుడు శ్రీరాముల భూమాచారి, అటవీ సంరక్షణ ఉద్యమకారుడు ముత్తె శ్రీనివాస్, నాయకులు షేక్ అక్బర్, బీజేపీ విద్యార్థి నాయకులు పందిరి మనీష్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేశారు



వంతెన వద్ద దోజర్‌తో చదును చేస్తూ...

సాక్షి ఎఫెక్ట్..

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లి– నా గారాం ప్రధాన రహదారిపై నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ వద్ద మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ నెల 3న 'ప్రయాణం నరకమే' శీర్షిక ప్రచురితమైన కథనానికి మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ స్పందించారు. ట్రాక్టర్లతో కంకర, ఇసుక తెప్పించి గుంతలు ఉన్న చోట పోయించారు. మాజీ సర్పంచ్ తోకల రాంచందర్, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి దగ్గరుండి డోజర్ సాయంతో చదును చేయించారు.

నిందితుల అరెస్టు

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ గ్రామపంచాయతీ పరిధి కొమ్ముగూడెంలో గ్రామదేవత పోచమ్మ దేవాలయాన్ని ధ్వంసం చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ వివరాల ప్రకారం.. కొమ్ముగూడెం గ్రామానికి చెందిన దాగం మల్లేష్, జాడి అశోక్ అనే ఇద్దరు యువకులు సోమవారం అర్ధరాత్రి మద్యం చిత్తుగాతాగి, ఆ మత్తులో పోచమ్మ దేవాలయం చుట్టుపక్కల సంచరించారు. ఆ సమయంలోనే నిందితులిద్దరూ పోచమ్మ దేవాలయంలో చొరబడి గుడిలోని విగ్రహాలను ధ్వంసం చేశారని ఎస్సై తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం నిందితులిద్దరిని అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

బాలికా సాధికారతపై అవగాహన



పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోటపల్లి: మండలంలోని దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలికా సాధికారతపై జిల్లా జెండర్ స్పెషలిస్టు విజయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల రక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్స్, బాల్యవివాహాల నిర్మూలన, బాలిక చదువుపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం భూమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటపల్లిలో వనమహోత్సవం

కోటపల్లి: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో వన మహోత్సవంలో భాగంగా తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మయ్య మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎం రాజశేఖర్, టీఏలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధిలో నీటికుంటలు

- పంట పొలాలు, పశుపక్ష్యాదులకు ఉపయోగం
- ఈజీఎస్ ద్వారా డబ్బులు అందజేత
- జిల్లా వ్యాప్తంగా 544మంజూరు



అటవీప్రాంతంలో నిర్మించిన కుంటను పరిశీలిస్తున్న ఈజీఎస్ ఏపీవో

చెన్నూర్‌రూరల్: వర్షపు నీరు వృథాగా పోతూ ఉంటుంది. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పంటలు, పశుపక్ష్యాదులు నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఎదురవుతుంది. ఈ నేపథ్యంలో వర్షపు నీటి నిల్వ చేసుకుని పంటలు, అటవీ ప్రాంతంలో మొక్కలు, వన్యప్రాణులకు అందించేందుకు ఉపాధి హామీ పథకం కింద నీటికుంటల(ఫాంపాండ్) తవ్వకానికి ప్రభుత్వం నిధులు అందజేస్తోంది. రైతు పొలంలో నీటి కుంటలు ఎక్కడ నిర్మించుకోవాలో గుర్తించాలి. వర్షపు నీరంతా ఒక వైపు చేరడానికి అవకాశం ఉండి, నిల్వకు అనుకూలంగా ఉండే పల్లపు ప్రాంతంలో నీటికుంట నిర్మాణానికి గుర్తించాలి. ఉపాధి హామీ సిబ్బంది ఇచ్చే కొలతల ప్రకారం నీటిగుంతను తవ్వుకోవాలి. అటవీ ప్రాంతంలో మొక్కలు, వన్య ప్రాణులకు నీరు ఉండేలా ఒక ప్రదేశంలో తవ్వించాలి. జిల్లా వ్యాప్తంగా 544 నీటి కుంటలు మంజూరు కాగా, ఇందులో 50వరకు పూర్తయ్యాయి. వంద మీటర్ల పొడవు, 40 మీటర్ల వెడల్పు, 2ఫీట్ల లోతు ఉండేలా కుంటలు తవ్వించాలి. ఉపాధిహామీ కూలీలకు 800రోజుల నుంచి 1600రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకుంది. నీటి కుంట నిర్మాణానికి రూ.4లక్షల నుంచి రూ.10లక్షల వరకు ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా అందజేస్తుంది. పంట పొలాల్లో నీటి కుంటలు నిర్మించడంతో వర్షపు నీరంతా ఆ కుంటలో చేరి నిల్వ ఉంటుంది. పశువులకు, పక్షులకు తాగేందుకు నీరు లభిస్తుంది. ఈ నీటితో పండ్ల తోటలు, కూరగాయలను సాగు చేసుకోవచ్చు. పంటలకు పురుగుల మందు చల్లే సమయంలో సపరేటుగా నీటిని తెచ్చుకోకుండా కుంటలో నీటిని ఉపయోగించుకోవచ్చు. రైతులు తమ పంట పొలాల వద్ద నీటి కుంటలను నిర్మించుకుంటూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఆసక్తి ఉన్న రైతులు ముందుకు రావాలి



రైతులు తమ పంట పొలాల వద్ద నీటి కుంటలు నిర్మించుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వర్షపు నీటిని కుంటలో నిల్వ చేసుకొని ఉపయోగించుకోవచ్చు. నీటి కుంటల నిర్మాణానికి ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా డబ్బులు చెల్లిస్తుంది. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు రావాలి. రైతులు ఆయా గ్రామాల్లో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలి.

– కిషన్, డీఆర్డీవో

సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్: కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లకు నిరసనగా బుధవారం నిర్వహించే సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. జేఏసీ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్పీ 1, ఏరియా వర్క్‌షాప్, ఓపెన్ కాస్ట్ గనులపై గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. సమ్మెతోనే కేంద్రం దిగివస్తుందని, లేబర్ కోడ్‌లు రద్దు అయ్యేంత వరకు పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, గుల్ల బాలాజీ, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బండి రమేష్ పాల్గొన్నారు. సమ్మెకు మద్దతిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్, నాయకులు కార్తీక్ విష్ణుప్రియలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

పాతమంచిర్యాల: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మిక, కర్షకవర్గం జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ రాచమౌని నాగభూషణం, కో కన్వీనర్ మంతెన సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

నెన్నెల: సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి పేర్కొన్నారు. నెన్నెల మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పని గంటలను పది గంటలకు పెంచిందని, ఇది సరైంది కాదన్నారు. వెంటనే దీనిని రద్దు చేయాలన్నారు. ఈ సమ్మెకు సంపూర్ణ సంఘీభావ మద్దతును తెలియజేస్తున్నామన్నారు.

కాసిపేట: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెపై మంగళవారం కార్మిక సంఘాలు విస్తృత ప్రచారం నిర్వహించారు. మందమర్రి ఏరియా కాసిపేట 1, 2 గనులపై ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. కార్మికులు సమ్మెను విజయవంతం చేసి ఐక్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ అక్బర్ అలీ, ఐఎన్టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, సీఐటీయూ ఏరియా కార్యదర్శి మల్లి రవీందర్, టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'సమ్మెలో పాల్గొననున్న కార్మికులు'

పాతమంచిర్యాల: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని వివిధ సంస్థల ఉద్యోగులు, కార్మికులు పాల్గొంటున్నారని ఉద్యోగ సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ రంగు రాజేశం తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, సింగరేణి, జాతీయ బీమా సంస్థ, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారన్నారు.

విలీన గ్రామాల డివిజన్లు ఇవే..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి, కొత్తపల్లి, ముల్కల్ల, పోచంపాడ్, గుడిపేట, నంనూర్, చందనాపూర్, నర్సింగాపూర్ గ్రామాలు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. ఆయా గ్రామాల్లో 12,236 మంది జనాభా ఉంది. నర్సింగాపూర్ గ్రామం కార్పొరేషన్‌లో విలీనం కాలేదని, మంత్రి వివేక్‌వెంకటస్వామితో తమకు ఉన్న పరిచయంతో అడ్డుకున్నామని కొందరు ప్రచారం చేస్తుండడం గందరగోళానికి దారి తీస్తోంది. 17వ డివిజన్‌లో హద్దుల వివరణతో ఉండగా నర్సింగాపూర్ అని పేరు రాకపోవడంతో ప్రచారానికి తెర తీశారు. మంచిర్యాల టౌన్ ప్లానింగ్ అధికారి సంపత్‌ను సంప్రదించగా.. నర్సింగాపూర్ గ్రామం 17వ డివిజన్ పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు. కార్పొరేషన్ చివరి హద్దు వరకు డివిజన్‌గా పేర్కొనడంతో నర్సింగాపూర్ పేరు ప్రస్తావన రాలేదని తెలిపారు.

- 15వ డివిజన్‌లో వేంపల్లి శివారు నుంచి గోదావరి నది వరకు, కొత్తపల్లి శివారుతోపాటు వేంపల్లి నుంచి పాత మంచిర్యాల సబ్‌స్టేషన్ వరకు, అక్కడి నుంచి మంచిర్యాల శివారు శాలివాహన ప్లాంటు రోడ్డు వరకు ఉంది.
- 16వ డివిజన్‌లో ముల్కల్ల శివారులోని రాళ్ల వాగు రోడ్డు నుంచి పోచంపాడ్ శివారు మీదగా ముల్కల్ల గోదావరి నది వరకు ఉంది.
- 17వ డివిజన్‌లో గుడిపేట నుంచి బెటాలియన్ మీదుగా గోదావరి నది వరకు, గుడిపేట నంనూర్, చందనాపూర్ గ్రామాల మీదుగా మున్సిపల్ కార్పొరేషన్ హద్దు అయిన నర్సింగాపూర్ వరకు కలిసింది.
- 18వ డివిజన్‌లో గుడిపేట 13వ బెటాలియన్ చర్చి నుంచి గుడిపేట రెవెన్యూ గ్రామ శివారు పరిధితో రాళ్లవాగు మీదుగా కొత్తపల్లి, పోచంపాడ్, వేంపల్లి గ్రామాలు ఉన్నాయి.

ఘనంగా వైఎస్సార్ జయంతి



కాసిపేట: కేక్‌కట్ చేస్తున్న నాయకులు



బెల్లంపల్లి: కేక్ కట్ చేస్తున్న నాయకులు



రామకృష్ణాపూర్: జయంతిలో పాల్గొన్న నాయకులు

జన్నారం/రామకృష్ణాపూర్/చెన్నూర్/మందమర్రి రూరల్/కాసిపేట/బెల్లంపల్లి: ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి జయంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ కార్యాలయాల ఆవరణలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పలుచోట్ల రోగులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ చేశారు. పేదప్రజల కోసం వైఎస్సా ర్ అనేక పథకాలు అమలు చేశారన్నారు. ఆరోగ్య శ్రీ, 108, 104 అంబులెన్స్‌లు, ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ అకాల మరణం కాంగ్రెస్‌పార్టీకి తీరని నష్టం కలిగించిందని పేర్కొన్నారు. బెల్లంపల్లిలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, నాయకులు టి.మల్లేష్, నయీమ్, రాజలింగు, జన్నారంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, పార్టీ ప్రధాన కార్యదర్శి మాణిక్యం, రామకృష్ణాపూర్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి, పాతర్ల నాగరాజు, చెన్నూరి శ్రీధర్, గజ్జెల అంకగౌడ్, పెండ్యాల శ్రీకాంత్, చింతల లక్ష్మణ్, మందమర్రిలో నాయకులు సుదర్శన్, నాయకులు శ్రీనివాస్, నర్సింగ్, రాజు, రాజయ్య, సంతోష్, వేణు, కాసిపేటలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, నాయకులు సత్తయ్య, రమేష్, సిరాజ్‌ఖాన్, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



చెన్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



జన్నారం: బ్రెడ్ పంపిణీ చేస్తున్న నాయకులు



మందమర్రిరూరల్: కేక్ కట్ చేస్తున్న సుదర్శన్

విద్యార్థి సంఘాలపై కలెక్టర్‌కు ట్రస్మా ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ట్రస్మా సభ్యులు

మంచిర్యాలఅర్బన్: విద్యార్థి సంఘాల పేరుతో, కొంతమంది తమ పాఠశాలలకు వచ్చి డబ్బులివ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం అందించినట్లు ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దామెర్ల సిద్ధయ్య తెలిపారు. డబ్బులు ఇవ్వని క్రమంలో ఆ పాఠశాలపై అబద్ధపు ప్రచారాలు చేస్తూ వేధిస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఎవరైనా స్కూల్ యాజమాన్యాన్ని బెదిరించినట్లు, డబ్బులు అడిగినట్లు ఆధారాలు చూపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం డీఈవో యాదయ్యను కూడా కలిసి పాఠశాలల సమస్యలపై వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రమోహన్‌గౌడ్, రాపోలు విష్ణువర్ధన్‌రావు, పద్మచరణ్, సురభిశరత్ కుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం కల్పించాలని వినతి

పాతమంచిర్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు అన్నారు. మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఏదునూరి రమేశ్, మంచర్ల సదానందం, జంగంపల్లి రామస్వామి, తాళ్లపల్లి చంద్రశేఖర్, బడికెల క్రాంతి, పర్వతం నరేశ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మెడికల్ కాలేజీ విద్యార్థుల చేయూత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులంతా కలిసి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి, అవసరమున్న వారికి చేయూతను అందిస్తున్నారు. కళాశాలలో చదువుతున్న మూడు సంవత్సరాల ఎంబీబీఎస్ విద్యార్థులు 300మంది ప్రతి నెలా రూ.100చొప్పున జమచేసి, వాటిని కళాశాలలో అవసరమున్న విద్యార్థులతో పాటు, సాయం కోసం చూస్తున్న వారికి మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. లక్సెట్టిపేట మండలంలోని ఎల్లారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, హాజీపూర్ మండలంలోని దుబ్బపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కూల్ బ్యాగులను అందించారు.

మొక్కు చెల్లింపు

మందమర్రిరూరల్: ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది పూర్తి ఆరోగ్యంతో రెండు రోజుల క్రితం మందమర్రిలోని తన నివాసానికి చేరుకున్నారు. ఆరోగ్యం కుదుటపడితే గుడికి వస్తామని మేడారం సమీపంలోని కోరెగట్టు ఆంజనేయస్వామికి పలువురు మొక్కుకున్నారు. ఓదెలును మంగళవారం ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు సమర్పించారు. సత్యనారాయణ, శంకర్, సంఘి సంతోష్, తుంగపిండి శంకర్, ఏల్పుల రవి, పోశం ఉన్నారు.

రైతులకు వరి విత్తనాలు పంపిణీ

దండేపల్లి: మండలంలోని ఐదు గ్రామాలకు చెందిన రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం కింద జేజీఎల్–27356 రకానికి చెందిన 24 క్వింటాళ్లు(96 బస్తాలు) పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ అనిత, ఏవో అంజిత్‌కుమార్, ఏఈవోలు నరేశ్, మౌనిక, శ్రీకన్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

బెల్లంపల్లి: బెల్లంపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని శాంభవి ఐ విజన్ సెంటర్ ఆవరణలో నిర్వహించిన శిబిరంలో కంటి సమస్యలు ఉన్న 80మంది హాజరు కాగా వీరికి ఆప్తమాలజిస్ట్ కొంకటి అంజయ్య పరీక్షలు చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు దాసరి అరుణసుందరి, కార్యదర్శి ఆదర్శ్‌వర్ధన్ రాజు, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓకు ఆత్మీయ వీడ్కోలు

నెన్నెల: బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు, అధికారులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేష్, సంధ్య, తిరుపతి, ప్రకాష్‌రావు, తిరుపతిరెడ్డిలు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయించిన పోలీసులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణ సమీపంలోని బతుకమ్మ వాగు సమీపంలో గల జాతీయ రహదారిలో గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన సీఐ దేవేందర్‌రావు మంగళవారం మొరంతో గుంతలను పూడ్చి వేయించారు. కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

కంది విత్తనాలు పంపిణీ

బెల్లంపల్లి: వ్యవసాయ శాఖ ద్వారా బెల్లంపల్లి రైతు వేదికలో మంగళవారం చంద్రవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతం స్వామి, మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్ ఎంపిక చేసిన 15మంది రైతులకు కంది సంచులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు సీ.హెచ్.తిరుపతి, కె.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొననున్నట్లు ఎంఈఓ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాయితేజ, మానస, వెంకటవ్వ, ఎల్లమ్మ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ విగ్రహావిష్కరణ

దండేపల్లి: దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పూరెళ్ల లక్ష్మణ్ విగ్రహాన్ని కుటుంబ సభ్యులు, బ్రమరాంబిక ఆలయ వ్యవస్థాపకుడు రఘునాథ్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు.

రక్తదాన శిబిరం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని తేజ ల్యాబ్‌లో మంగళవారం మేక వరప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. వరప్రసాద్ సతీమణి శ్రీవాణి, కుమార్తె డాక్టర్ కుసుమశ్రీల ఆధ్వర్యంలో 70మంది రక్తదానం చేయగా, 300మందికి అన్నదానం చేశారు.

బెల్లంపల్లి, తాండూర్ సీఐలు బదిలీ



బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు

బెల్లంపల్లి/తాండూర్: బెల్లంపల్లి, తాండూర్ సీఐలు బదిలీ అయ్యారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న ఎస్.దేవయ్య తాండూర్ సీఐగా బదిలీ కాగా, దేవయ్య స్థానంలో కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌రూరల్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న కె.శ్రీనివాసరావును బెల్లంపల్లి వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. బెల్లంపల్లి రూరల్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న సయ్యద్ అఫ్జలుద్దీన్‌ను, తాండూర్ సీఐగా పనిచేస్తున్న కె.కుమారస్వామిని బదిలీ చేసి మల్టీ జోన్–1 ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ఖమ్మం సీఎస్‌బీలో పనిచేస్తున్న సీఐ చందవోలు.హస్సన్‌ను బెల్లంపల్లి రూరల్ సీఐగా బదిలీ చేస్తూ తెలంగాణ మల్టీజోన్–1 ఐజీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

282 జీవో ప్రతులు దహనం

జన్నారం: కార్మికులకు నష్టం కలిగించే జీవో నం.282ను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరం అశోక్ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో మంగళవారం జీవోకు సంబంధించిన ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కొండ గొర్ల లింగన్న, సీఐటీయూ సీనియర్ నాయకులు కుకటి కారు బుచ్చన్న, సీఐటీయూ మండల నాయకులు పాల్గొన్నారు.

డైరెక్టర్(పా)కు వినతుల వెల్లువ

శ్రీరాంపూర్: సింగరేణి డైరెక్టర్ (పా) గౌతం పొట్రు, ఐఏఎస్‌ను పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి ఆయన మంగళవారం శ్రీరాంపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుధాకర్, అఫ్రోజ్‌ఖాన్, సందీప్, సత్తయ్య పాల్గొన్నారు. ఆర్కే న్యూటెక్ గని వద్ద టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఐఎన్టీయూసీ నాయకులు వేర్వేరుగా కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లో డబుల్ బెడ్ రూం క్వార్టర్లు నిర్మించాలని, సీసీసీ కార్నర్ నుంచి గెస్ట్‌హౌస్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. 50పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, సింగరేణి పాఠశాలను ఆధునీకరించి మరిన్ని సౌకర్యాలు కల్పించాలని ఐఎన్టీయూసీ నాయకులు కోరారు.

'మంజూరైన రోడ్డును నిలిపేశారు'



నిరసన తెలుపుతున్న స్థానికులు

భీమారం: మండల కేంద్రంలోని మన్నెపు వాడకు సీసీ రోడ్డు మంజూరైనప్పటికీ, రోడ్డు నిర్మించడం లేదని స్థానికులు తెలిపారు. అల్లునూరి మల్లయ్య ఇంటి నుంచి ఆయిత మధునయ్య ఇంటి వరకు 8ఫీట్ల వెడల్పుతో రోడ్డుకి నిధులు మంజూరు చేసినట్లు అధికారులు ప్రకటించారని తెలిపారు. గత సంవత్సరం నుంచి ఎదురుచూస్తున్నా, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం లేదని వాపోయారు. రోడ్డు నిర్మించేందుకు వెడల్పు ఎక్కువ లేకపోవడం కారణం చూపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రోడ్డుపై నిరసన తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ చర్యలు చేపట్టి, సీసీ రోడ్డును వెంటనే ప్రారంభించేలా చూడాలని కోరారు.

'పశువులను రోడ్లపైకి వదలొద్దు'

భీమారం/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్: పశువులను రోడ్ల పైకి వదిలితే, వాటిని గోశాలకి తరలిస్తామని భీమారంలో ఎస్సై శ్వేత, రామకృష్ణాపూర్‌లో పట్టణ ఎస్సై రాజశేఖర్, మందమర్రిలో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కొందరు పశువులను ఇంట్లో కట్టేసి ఉంచకుండా, కావాలని రోడ్లపైకి పంపిస్తున్నారని తెలిపారు. దీని కారణంగా రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచి రోడ్లపైన పశువులు కనిపిస్తే వాటిని స్వాధీన పర్చుకొని, వెంటనే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

నాలుగు రోజుల శిశువుకు రక్తకణాలు దానం



ప్రశంసాపత్రం ఇస్తున్న మధుసూదన్‌రెడ్డి

పాతమంచిర్యాల: నెన్నెల మండలానికి చెందిన నిరుపేద మహిళ హంస జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. నాలుగు రోజుల శిశువుకు రక్తకణాలు తగ్గి ప్రాణాపాయ స్థితిలో ఉండగా, ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రా రెడ్డి ఏబీ పాజిటివ్ రక్తకణాలు అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీకి సమాచారం అందించారు. రెడ్‌క్రాస్‌సొసైటీ సభ్యులు గుడిపేట13 బెటాలియన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్‌కు తెలుపగా ఆయన రక్తకణాలు డొనేట్ చేశారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వెంకటేష్‌ను రెడ్‌క్రాస్ సొసైటీ ఇన్‌చార్జి మధుసూదన్ రెడ్డి అభినందించి ప్రశంసా పత్రం అందించారు.